# క్రీడాకారులకు రాష్ట్ర సర్కారు ప్రోత్సాహం



బెల్లంపల్లి రూరల్ : సీవోఈ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- సీవోఈ క్రీడా మైదానం పరిశీలన

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 3: క్రీడాకారులకు రాష్ట్ర సర్కారు ప్రోత్సాహం అందిస్తున్నదని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. బెల్లంపల్లి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) క్రీడా మైదానాన్ని మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరిశీలించారు. ఈ నెల 13 నుంచి 16 వరకు జోనల్‌స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనుండడంతో క్రీడా మైదానంలో చదును చేసే పనులను ప్రిన్సిపాల్ ఐనాల సైదులుతో కలిసి ఎమ్మెల్యే చిన్నయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యమిస్తున్నదన్నారు. సంక్షేమ గురుకులాల్లో ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేసి క్రీడాకారుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. సౌకర్యాలను అందిపుచ్చుకుని గురుకుల విద్యార్థులు అంతర్జాతీయ వేదికలపై అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే విద్యార్థులకు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పన్ బత్తుల సుదర్శన్, జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, నాయకులు గడ్డం భీమాగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు వామన్, రాకేశ్ పాల్గొన్నారు.

**పీపీ ల్యాండ్ పట్టాల సమస్య పరిష్కారానికి కృషి**

బెల్లంపల్లి, అక్టోబర్ 3: కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామ పీపీ ల్యాండ్ పట్టాల సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. ఆగ్రామానికి చెందిన సుమారు వంద మంది మహిళలు క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వినతి పత్రం సమర్పించి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మహిళలు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లతశ్రీ, రైతు బంధు సమితి అధ్యక్షుడు శ్రీరామారావు, మండల యూత్ అధ్యక్షుడు ప్రశాంత్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సురేశ్ నాయకులు శంకర్ తదితరులున్నారు.



బెల్లంపల్లి : ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వినతి పత్రం ఇస్తున్న మహిళలు

## నేడు ఆర్కే న్యూటెక్ గని పునర్ ధ్రువీకరణకు

# ప్రజాభిప్రాయ సేకరణ

- 5 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీతకు రీవ్యాలిడేషన్




ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాటు చేసిన వేదిక

శ్రీరాంపూర్, అక్టోబర్ 3 : శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గనిలోని బొగ్గు నిక్షేపాలు వెలికి తీయడానికి ఈ నెల 4న బుధవారం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు బహిరంగంగా సమావేశం నిర్వహించనున్నది. ఈ మేరకు సింగరేణి ఎన్విరాన్మెంట్ డిపార్ట్‌మెంట్, కాలుష్య నియంత్రణ మండలి శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాట్లు చేసింది. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి వారి అభిప్రాయాన్ని తెలపాలని కాలుష్య నియంత్రణ మండలి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య మండలి ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ లక్ష్మణ్‌ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ హాజరు కానున్నారు. ఆర్కే న్యూటెక్ గని జీవిత కాలం 5 సంవత్సరాలు పాటు ఉండనున్నది. గనిలోని బొగ్గు నిక్షేపాలు సుమారు 5 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీయడానికి అనుమతి కోరుతూ పునర్‌ధ్రువీకరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ(పబ్లిక్‌హియరింగ్) చేపట్టనున్నారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్, ఆర్కే న్యూటెక్ గని పరిసర గ్రామాలు రామారావు పేట, ప్రభావిత గ్రామాలు ముదిగుంట, రసూల్‌పల్లి వాసులకు పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు ద్వారా సమాచారం ఇచ్చారు. ప్రచారం కూడా చేస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు సింగరేణి అన్ని విధాలా ఏర్పాట్లు చేసింది.

## నేడు తపాలా ఉద్యోగుల గ్రామీణ డక్ సేవక్ సమ్మె

తాండూర్, అక్టోబర్ 3 : ఆలిండియా నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ బ్యాంక్ సేవక్ ఆధ్వర్యంలో అక్టోబర్ 4న నిర్వహించనున్న ఒక్క రోజు సమ్మెలో పాల్గొననున్నట్లు ఆలిండియా నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ బ్యాంక్ సేవక్ సర్కిల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, తాండూర్ గ్రామీణ డక్ సేవక్ అబ్దుల్ హక్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలిండియా తపాలా గ్రామీణ డాక్ సేవక్‌లు దేశంలో దాదాపు మూడు లక్షల మందికి పైగా ఈ సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. ఎనిమిది గంటల పని, పింఛన్ సహా, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు, గ్రాట్యుటీ రూ.5 లక్షలకు పెంచాలనే డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

# పందులను ఊరి బయట పెంచాలి

- పెంపకందారుల ఇంటి ముందు గ్రామస్తుల ధర్నా



పందుల పెంపకందారుల ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

కాసిపేట, అక్టోబర్ 3 : సోమగూడెం గ్రామంలో పందులు అధికంగా తిరుగుతున్నాయని, దీంతో ప్రజలకు రోగాలు వచ్చే అవకాశం ఉందని, వాటిని ఊరి బయట ఉంచాలని సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన చేశారు. పందుల పెంపకందారుల ఇంటి ముందు ధర్నా చేశారు. సర్పంచ్ ప్రమీలాగౌడ్ మాట్లాడుతూ పందుల పెంపకందారులు వెంటనే పందులను ఊరు బయటకు తరలించి అక్కడ పందుల దొడ్డి ఏర్పాటు చేసుకొని సాదుకోవాలని సూచించారు. గ్రామంలో పందులను మేప వద్దని, దీనికి గాను ట్రాక్టర్ ఇటుక లోడ్‌తో పాటు ఇతర పందులకు ఆహారం కూడా ఇస్తానని తెలిపారు. పందులు గ్రామంలో తిరగడం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని, వెంటనే తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలాగౌడ్, నాయకులు ఊరగొండ జ్యోతి, శ్రీరాముల శ్రీను, సత్తయ్య, రాజేశ్వరి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తాండూర్‌కు చేరిన బతుకమ్మ చీరలు



తాండూర్ తహసీల్ కార్యాలయంలో బతుకమ్మ చీరలు

తాండూర్, అక్టోబర్ 3 : తాండూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి బతుకమ్మ చీరలు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ డీలర్లకు బతుకమ్మ చీరలను అందించామని తహసీల్దార్ డీ రోహిత్ తెలిపారు. మండలానికి 10,557 చీరలు వచ్చాయని, లబ్ధిదారులకు ఇవ్వడానికి రేషన్ డీలర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

## నేడు బెల్లంపల్లిలో బతుకమ్మ చీరల పంపిణీ

బెల్లంపల్లి, అక్టోబర్ 3: పట్టణంలోని మహేశ్వర్ భవన్‌లో బుధవారం ఉదయం 9.30కు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై చీరలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## విదేశాల్లో ఉపాధి కోసం దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్, కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా అర్హత, నైపుణ్యం, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశాల్లో ప్లేస్‌మెంట్ సులభతరం చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకట రమణ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. టామ్‌కామ్ గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రొమేనియా, యూకే వంటి దేశాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఏజెన్సీలతో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. యూఏఈ, ఆస్ట్రేలియా, మా ల్టా, మారిషస్, జపాన్, జర్మనీలో ఖాళీలకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కరీంనగర్, రామగుండం, మంచిర్యాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న కరీంనగర్‌లోని బైపాస్‌రోడ్డు, ఉజ్వల పార్కు ఎదురుగా గల ఐటీ టవర్స్‌లోని టాస్క్ రీజనల్ సెంటర్‌లో, 5న రామగుండం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో, 6న మ ంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో నమోదు డ్రైవ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అప్‌డేట్ చేసి న రెస్యూమ్, సంబంధిత డాక్యుమెంట్లతో డ్రైవ్‌కు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు www.tomcom. telangana.gov.inలో, టామ్ కామ్ సంస్థ 83478 38738, 78935 66493, 98496 39539లలో సంప్రదించాలని తెలిపారు.

## స్టేట్ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 3 : కరీంనగర్ జిల్లాలో సెప్టెంబర్ 30వ తేదీ నుంచి అక్టోబర్ 1 వరకు జరిగిన స్టేట్ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం సాంబమూర్తి, ఈగం మారయ్య మంగళవారం తెలిపారు. 18 సంవత్సరాల్లోపు బాలుర విభాగంలో కే ప్రణయ్ 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం సాధించాడని, అండర్ 16 బాలికల విభాగంలో బీ శృతి లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్, అండర్ 14 బాలికల విభాగంలో జీ నాగసాయిశ్రీ సిల్వర్ మెడల్, 20 సంవత్సరాల్లోపు బాలుర విభాగంలో జీ అంజి 400 మీటర్ల హర్డిల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. గెలుపొందిన క్రీడాకారులను, కోచ్‌లను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

## ఐటీఐలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోండి

శ్రీరాంపూర్, అక్టోబర్ 3 : ఈ నెల 9న సోమవారం శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీకి వాక్ ఇన్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం చందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను శ్రీరాంపూర్ ఐటీఐలో 5వ విడుత సీట్ల భర్తీకి ఈ నెల 9న వాక్ ఇన్ అడ్మిషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 8లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ https: iti.telangana.gov.ITI Srirampur ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం అవసరం లేదన్నారు. అఫ్లికేషన్ ప్రింట్‌తో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ అడ్మిషన్‌కు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 3: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. జాతీయ రహదారి, రైల్వే ట్రాక్ పక్కన గల నాలాలో మృతదేహం పడి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 45 సంవత్సరాలు ఉంటుందని, అనారోగ్య కారణాలతో చనిపోయి ఉంటాడని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలిస్తే సీసీసీనస్పూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ రవికుమార్ కోరారు.